

# సైకియాట్రిక్ కథలు

## అమ్మకూచి

మన కులంకాని అమ్మాయిని ఎలా పెళ్ళి చేసుకుంటావురా? ఆ అమ్మాయి మనింటికొచ్చి, మనతో ఎలా ఉంటుంది? నువ్వా పిల్లను చేసుకుంటే నేను ఊరి పోసుకు చస్తాను'' అంది కాంతమ్మగారు.

తల్లి అన్నంత పనీ చెయ్యగలదని భయపడ్డాడు మదన్. అతను తల్లికి ఒక్కడే కొడుకు. ఎమ్.కామ్ పాసయి ఒక ప్రైవేటు కంపెనీలో క్లర్కుగా పనిచేస్తున్నాడు. పక్క ఆఫీసులో రిసెప్షనిస్టుగా పనిచేసే మంజరితో పరిచయమైంది. పరిచయం ప్రేమగా మారింది. ప్రేమను శాశ్వత బంధంగా మార్చుకోవా లనుకున్నారు మంజరి, మదన్‌లు. ఇరవై ఎనిమిదేళ్ళ మదన్ తల్లితో తన ప్రేమ విషయం చెప్పాడు. కాంతమ్మగారు కులాంతర వివాహం పనికిరాదని పట్టుపట్టింది.

మదన్ మంజరితో తల్లి అభిప్రాయం చెప్పాడు. ''ధైర్యంగా రిజిస్టర్ మారేజి చేసేసుకుందాం. కొన్నాళ్ళకి ఆవిడే సద్దుకుపోతారు. ఒక్కగానొక్క కొడుకుని, నిన్ను వదులుకుంటారా? నా కులం ఏదైనా ఆవిడను నేను తల్లిలా చూసుకుంటానని హామీ ఇస్తున్నాను'' అంది మంజరి.

ఇటు తల్లిని ఒప్పించలేక, అటు ప్రేమించిన అమ్మాయిని వదులుకోలేక నలిగిపోయాడు మదన్. కొన్నాళ్ళకి అతని ప్రేమ ఓడిపోయింది. తల్లి మాట నెగ్గింది. కొడుకుగా తల్లి మాట వినడం తన ధర్మం అనుకున్నాడు మదన్.

కానీ అతని మనస్సు మంజరిని మర్చిపోలేకపోయింది. అతను మంజరిని చూడడం మానేశాడు. అయితే అతని కళ్ళముందు ఆమె బొమ్మ కదుల్తూనే ఉండేది. మంజరిని వివాహం చేసుకోవలేని తన బలహీనతమీదా, వివాహం చేసుకోనివ్వని తల్లి పట్టుదల మీదా ఒక్కోసారి అతనికి కోపం వచ్చేది. ఒక్కోసారి తల్లికి అన్నీ తెలుసనీ, జీవితంలో అనుభవం ఉండడం వల్లనే ఆమె ఈ వివాహం వద్దని హెచ్చరించిందనీ, ఆమె ఏం చెప్పినా తన మంచికేననీ అనుకునేవాడు.

కాంతమ్మగారు మొండి పట్టుదల గల మనిషి. ఆమెకు తన మాట నెగ్గడం తప్ప ఇంకేమీ పట్టదు. అటువంటి తల్లిని ఎదిరించలేని తన బలహీనతకు బాధపడేవాడు మదన్. అతనిలో భావాలు రకరకాలుగా ఊగిసలాడసాగాయి. తను అనుకున్న వివాహం చేసుకోలేని దుఃఖం కొంతకాలానికి మరీ ఎక్కువై అతను సైకాలజిస్టు దగ్గరకు ట్రీట్‌మెంట్‌కి వెళ్ళాడు.

**ఇటు తల్లిని ఒప్పించలేక, అటు ప్రేమించిన అమ్మాయిని వదులుకోలేక నలిగిపోయాడు మదన్. కొన్నాళ్ళకి అతని ప్రేమ ఓడిపోయింది. తల్లి మాట నెగ్గింది. కొడుకుగా తల్లి మాట వినడం తన ధర్మం అనుకున్నాడు మదన్.**

సైకాలజిస్టు మదన్‌ని అతని గురించిన వివరాలు అడిగాడు. తన చదువు గురించీ, ఉద్యోగం గురించీ, కుటుంబం గురించీ మొత్తం విషయాలు చెప్పాడు మదన్.

''ఎమ్.కామ్ డిస్టింక్షన్‌తో పాసయ్యారు కదా. ఇంత చిన్న ఉద్యోగం చేస్తున్నారేం?''

మదన్ సిగ్గుతో, భయంతో నిండిన కంఠంతో ''నాకు నిర్ణయాలు తీసుకోవడం రాదండీ. నలుగురి చేత పని చేయించడం కూడా రాదు. మా అమ్మ చాలాసార్లు ఆ మాటే చెప్పింది. ఏమీ రానప్పుడు నేను ఆఫీసరు పోస్టుకి ఎలా వెళ్ళను'' అన్నాడు.

''పోనీ క్లర్కు పోస్టు చెయ్యాలనుకున్నా ఏ గవర్నమెంట్‌లోనో, బాంకులోనే చెయ్యొచ్చునే''

''ట్రాన్స్ఫర్లుంటాయి. వేరే ఊరు వెళ్ళాల్సి వస్తుంది.''

''అంటే...'' మరిన్ని వివరాల కోసం అడిగాడు సైకాలజిస్టు.

''నేనెప్పుడూ మా అమ్మని వదిలి పెట్టి ఉండలేదండీ. రాత్రి మా అమ్మ పక్కన లేకపోతే చిన్నప్పుడు పడుకోలేకపోయేవాణ్ణి. మా అక్కలు ముగ్గురూ మా అమ్మమ్మ ఇంటికి వెళ్ళేవాళ్ళు కానీ నాకు మాత్రం భయంగా ఉండేది. స్కూలికి వెళ్ళినా ఎప్పుడింటికి వచ్చేస్తానా అన్పించేది. ఇంకో ఊళ్ళో మంచి కాలేజిలో సీటు వచ్చినా వెళ్ళలేదు. చిన్నప్పుడు క్లాస్‌మేట్స్ నన్ను చంటబ్బాయ్ అని వెక్కిరించేవారు. నాకు కావాల్సినవాటికై గట్టిగా అడగలేకపోయేవాణ్ణి''

''మీ సెక్సు కోరికలు...''

మదన్ కొద్దిగా సిగ్గుపడ్డాడు. ''మామూలుగానే కోరికలు వస్తాయి. అయితే ఏ ఆడదాన్నీ నేను మా అమ్మని ప్రేమించినంతగా ప్రేమించలేను. అందుకే నేను మంజరిని వదులుకోగలిగాను''

''మంజరిని మనస్ఫూర్తిగా వదులుకోగలిగారా?''

మదన్ జవాబు చెప్పలేదు. అతని ముఖంలో బాధ కన్పించింది.

సైకాలజిస్టు కేసును అంచనా వేశాడు. ముగ్గురాడపిల్లల తర్వాత పుట్టాడు మదన్. అతని తల్లీ, అక్కలూ అతన్ని అతి గారాబంగా చూశారు. అందుకే ప్రతి చిన్న పనికీ ఇతరుల మీద ఆధారపడడం అతనికి అలవాటైపోయింది. సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం, సొంతంగా పనిచేసుకోవడం అతనికి రాలేదు. తల్లి నుంచి దూరంగా ఉండడానికి కూడా అతనికి భయమే. ఇరవై ఎనిమిదేళ్ళు వచ్చినా అతను పసిపిల్లవాడే.

ఏ పనిలోనూ ముందుకు చొచ్చుకుపోవడం అతినికి రాదు. ఇతరుల నిర్ణయాల మీదనే ఆధారపడే అతను ప్రమోషన్లని కూడా వద్దనుకున్నాడు. ఎప్పుడైనా ఒక్కడూ ఉండాలంటే భయమూ, అందరూ తనను వదిలేస్తారేమోనని ఆందోళనా అతనిలో ఉన్నాయని సైకాలజిస్టు గ్రహించాడు.

అతి ముఖ్యమైన వివాహ విషయంలో కూడా నిర్ణయం తల్లికే వదిలేశాడు. తన ఇష్టాలకన్నా, అవసరాలకన్నా తల్లి అభిప్రాయానికే ఎక్కువ విలువ ఇచ్చాడు. ఇలా పూర్తిగా లొంగిపొయ్యే స్వభావం ఉన్నవాళ్ళ సాంఘిక జీవితం, ఉద్యోగం జీవితం దెబ్బతింటాయి.

మదన్‌ది మైల్డ్ డిపెండెంట్ పెర్సనాలిటీ డిసార్డర్ అని సైకాలజిస్టు నిర్ణయించాడు.

మదన్‌కి కొంత బిహేవియర్ థెరపీ, కొంత సైకో డైనమిక్ సైకో థెరపీ కలిపిన ట్రీట్‌మెంట్ జరిగింది. గ్రూఫ్ థెరపీలో కూడా మదన్ పాల్గొన్నాడు.

ఏ ఏ సందర్భాలలో మదన్ భయపడతాడో ముందుగా సైకాలజిస్టు తెలుసుకున్నాడు. ఆ సందర్భాలను క్లినిక్‌లో కల్పించారు. మదన్ ఎలా ప్రవర్తించాలో చెప్పాడు. తను ఒక పాత్రను పోషిస్తూ, మదన్ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొనేలా చేశాడు. నాలుగైదు సెషన్స్‌లో ఈ విధమైన రోల్ ప్లేయింగ్ అయ్యాక మదన్‌ని నిజజీవితంలో ఒక చిన్న సందర్భంలో ధైర్యంగా ప్రవర్తించమని పంపించాడు. మదన్ తను ఎలా ప్రవర్తించిందీ సైకాలజిస్టుకి చెప్పాడు. ఆయన మదన్‌ని మెచ్చుకున్నాడు. ఆ మెచ్చుకోలుతో మదన్‌లో ఉత్సాహం వచ్చింది. అతను నెమ్మది నెమ్మదిగా తనకు కావల్సినవి అడగడమూ, తనకు నచ్చినట్లుగా ప్రవర్తించడమూ నేర్చుకున్నాడు. అతని ఉద్యోగ జీవితం మెరుగైంది. తనకు వచ్చిన ప్రమోషన్‌ని ఆనందంగా స్వీకరించగలిగాడు. సైకాలజిస్టు అతనిలోని మార్పుని గమనిస్తూ సెషన్‌కీ, సెషన్‌కీ మధ్య దూరాన్ని పెంచాడు. కొన్నాళ్ళకి మదన్‌లో డిపెండెంట్ పెర్సనాలిటీ డిసార్డర్ చాలా మటుకి తగ్గిపోయింది.

ఏడాది తర్వాత మదన్ తల్లి అదుపాజ్ఞల నుంచి బయటపడి, మంజరిని వివాహం చేసుకున్నాడు. అతని వివాహ జీవితం ఆనందంగా సాగిపోయింది.

**-పాలంకి సత్య**
(హైదరాబాద్) ★